
ఆంధ్రజ్యోతి

***

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శనివారం 2 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106


సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.145	215	244
సూర్యాపేట	రూ.165	230	260
నల్లగొండ	రూ.146	206	246

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 | కనిష్ఠం 23.4



నత్తనడకన పంట రుణాలు

బ్యాంకర్లు ప్రకటించిన పంట రుణ ప్రణాళికకు, పంపిణీకి ఏమాత్రం పొంతన కుదరడం లేదు. వానాకాలంతో పాటు ప్రస్తుత యాసంగిలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే తీవ్ర వర్షాభావ పరిస్థితులకు తోడు పంటలు సైతం ఎండి పోతుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం సైతం పంట రుణాల విషయంలో పూర్తిస్థాయి సమీక్ష చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- నల్లగొండ

- రుణమాఫీతో మెలికపెడుతున్న బ్యాంకర్లు
- పాత రుణాలు చెల్లిస్తేనే కొత్తవి
- కనీసం 40శాతం మంది రైతులకు అందని వైనం
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకపోవడంతో పాటు ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియపై నీలినీడలు అలుముకున్నాయి. ఓ వైపు రుణమాఫీ, మరో వైపు రైతుబంధు లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీపై బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పినా, నేటికీ రాష్ట్రస్థాయిలో సమావేశం ఏర్పాటు చేయలేదు. బ్యాంకర్లు రుణాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో రుణమాఫీకి సంబంధించిన నిధుల విడుదల విషయంలో ఎలా సమన్వయం చేస్తారనేదానిపై స్పష్టత లేదు. దీంతో ఉమ్మడి జిల్లా రైతులు అయోమయంలో పడ్డారు.

లక్ష్యం చేరని పంట రుణాలు

జిల్లా వ్యాప్తంగా 2023-24లో ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ.6,479కోట్ల రుణాలకు రూ.4,600.20కోట్లు మంజూరు చేశారు. అందులో టర్మ్ రుణాలు కేవలం రూ.518.98 కోట్లు మాత్రమే. 2023లో డిసెంబరు వరకు మొత్తం రూ.6022.56కోట్లకు పంట రుణాలు రూ.3433.26కోట్లు ఇవ్వగా టర్మ్ రుణాలు రూ.1,392కోట్లు మాత్రమే ఇచ్చారు. దీంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. గత వానాకాలంతో పాటు యాసంగిలో పంట రుణాలు పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో రైతులకు సమస్యలు ఎదురవుతున్నాయి. సీజన్లు ముగిసినా అప్పుల బాధతో రైతులు పంట రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. రెండు సీజన్లు కలిపి 40శాతం మంది రైతులకు మాత్రమే పంట రుణాలు ఇచ్చినట్టు సమాచారం. రుణమాఫీతో మెలిక పెడుతూ కొత్త రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు మొగ్గు చూపడం లేదు. రైతులు కూడా రుణమాఫీ అవుతుందని ఆశిస్తూ రుణాలు చెల్లించకపోవడంతో వడ్డీ పెరుగుతోంది. గత ప్రభుత్వం లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పగా, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పడంతో ఆశలు చిగురించాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రుణమాఫీపై ఎటూ తేల్చుకోలేకపోతోంది. మరోవైపు బ్యాంకర్లు పాత రుణాలను ఎలా రెన్యువల్ చేయాలన్న ఆలోచనలో పడ్డారు. రైతుబంధు సొమ్ము వచ్చినా, ధాన్యం విక్రయించిన డబ్బు వచ్చినా మినహాయించుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. రుణమాఫీ పథకంతోనే కొత్త రుణాలకు ముడిపెడుతుండటంతో పంట రుణాలు పరిస్థితి దారుణంగా ఉంది. రెన్యువల్ చేస్తేనే కొత్త రుణాలని బ్యాంకర్లు చెబుతున్నారు.

రుణమాఫీ రూ.1,044 కోట్లే

గత ప్రభుత్వం రుణ మాఫీని వాయిదాల పద్ధతిలో చేయడంతో రైతులకు పూర్తిస్థాయిలో నేటికీ అందలేదు. 2018 డిసెంబరు 11 వరకు కటాఫ్ నిర్ణయించగా, గత ప్రభుత్వం ఐదేళ్లలో జిల్లా వ్యాప్తంగా 3లక్షల769 మంది రైతులకు రూ.2,693 కోట్లకు కేవలం 1,65,300మంది రైతులకు రూ.1,044కోట్లు మాత్రమే చెల్లించింది. మిగతా మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు చెల్లిస్తాననేది ఇప్పటి వరకు స్పష్టం చేయలేదు. అదే విధంగా రైతుబంధు నిలిచింది. జిల్లాలో 5,42,606 మంది రైతులకు రూ.624,14,84,000 ఇప్పటి వరకు 3,87,675మంది రైతులకు ఫిబ్రవరి 29 తేదీ నాటికి కేవలం రూ.269,75,37,845 మాత్రమే రైతుల ఖాతాల్లో జమయ్యాయి. రైతుబంధును మార్చి 15 నాటికి పూర్తిస్థాయిలో రైతుల ఖాతాలో జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. అయితే ప్రస్తుత పరిస్థితులను చూస్తే నిధులు సమకూరేలా కనబడటం లేదు. రూ.2లక్షల రుణమాఫీపై విధివిధానాలు ఖరారు కాలేదు. నిధులను కూడా సమకూర్చలేదు. నిధుల సర్దుబాటు కష్టంగా మారిన పరిస్థితులో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి రుణం తీసుకుని రైతుల బకాయిలను క్లియర్ చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అది ఎంతవరకు అమలు జరుగుతుందనేది వేచి చూడాల్సిందేనని పలువురు భావిస్తున్నారు. గత ప్రభుత్వం రుణమాఫీపై డిసెంబరు 18 వరకు కటాఫ్ తేదీ నిర్ణయించగా, ప్రస్తుత ప్రభుత్వం ఇంకా దీనిపై నిర్ణయం తీసుకోలేదు. రైతులు తీసుకున్న రుణాలపై రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇచ్చి బ్యాంకర్ల నుంచి కొత్త రుణాలు ఇప్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ధరణి పోర్టల్‌తో కూడా రుణమాఫీకి సమస్యలు ఎదురవుతున్నాయి. ధరణి పోర్టల్‌ను ఆధారంగా చేసుకుని కొన్ని బ్యాంకుల్లో పంట రుణాలు ఇచ్చే విషయంపై తిరకాసు పెడుతున్నారు. కొంతమంది రైతుల భూముల వివరాలు ధరణి పోర్టల్‌లో కనిపించకపోవడంతో రుణాలు ఇవ్వడం లేదు. పాస్‌బుక్ ఉండి కూడా ఉపయోగం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరణిలో ఉన్న అనేక సాంకేతిక సమస్యలు రైతులను ముప్పుతిప్పలకు గురిచేస్తున్నాయి. ధరణి కారణంగా చాలా మంది రైతులు రుణాలకు దూరమవుతున్నారు. ఓ వైపు రైతుబంధు రాక, మరోవైపు రుణమాఫీ కాక రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

కొత్త రుణాలు ఇవ్వడం లేదు



రూ.1లక్ష పంట రుణం తీసుకున్నా. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు రుణమాఫీ చేయలేదు. అప్పటి ప్రభుత్వంతో పాటు ఇప్పటి ప్రభుత్వం కూడా రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకులో వడ్డీ పెరుగుతోంది. పాత రుణం తీర్చడం లేదని బ్యాంకులు కొత్త రుణాలు ఇవ్వడం లేదు. రుణమాఫీ జరిగితే కొత్త రుణాలు ఇస్తామంటున్నారు. ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలి.

- వనపర్తి శేఖర్, రామలింగాలగూడెం, తిప్పర్తి

సమన్వయంతో ముందుకు సాగుతున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల సంక్షేమం కోసం వ్యవసాయ అనుబంధశాఖలతో పాటు బ్యాంకర్లతో ముందుకు సాగుతున్నాం. పంటరుణాలను అందరి రైతులకు వర్తించేలా చర్యలు తీసుకుంటున్నాం. అదేవిధంగా రుణమాఫీపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. సగం మంది రైతులు ఇప్పటికే రుణమాఫీ జరిగింది. మిగతా రైతులకు త్వరలో అందుతుంది. రైతుబంధు నగదు కూడా రైతుల ఖాతాల్లో జమ అవుతుంది.

- శ్రవణ్‌కుమార్, జేడీఏ



జాతీయ రహదారులపై వెదురు కర్రలతో ఏర్పాటు చేసే ఫెన్సింగ్ (ఫైల్)

జాతీయ రహదారులపై బాహుబలి కంచెలు

- వెదురు కర్రలతో ఫెన్సింగ్
- 17 బ్లాక్ స్పాట్ల వద్ద ఏర్పాటుచేసే ఆలోచన

చౌటుప్పల్, మార్చి 1: జాతీయ రహదారులపై రోజురోజుకూ ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. అందుకు వాహనాల రద్దీ, అతివేగం కారణాలవుతుండగా, మరోవైపు జాతీయ రహదారులపైకి విచ్చలవిడిగా మూగజీవాలు వస్తుండటంతో కూడా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదవశాత్తు జరుగుతున్న వాటితోపాటు పశువుల కారణంగా జరిగే ప్రమాదాలను సైతం అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జాతీయ రహదారులపై పశువుల కారణంగా నిత్యం ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, అందుకు పశువుల రాకను అడ్డుకొని ప్రమాదాల నివారణకు రహదారులకు ఇరువైపులా వెదురు కర్రలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్టు గతంలో కేంద్ర రహదారులు, రవాణా మంత్రిత్వశాఖ ప్రకటించింది. అందులో భాగంగా దేశంలో మొట్టమొదటిసారిగా మహారాష్ట్రలో చంద్రపూర్-యావత్‌మాల్ జాతీయ రహదారిపై వెదురు క్రాష్ బ్యారియర్లు ఏర్పాటు చేశారు. దీనికి బాహుబలి అని నామకరణం చేశారు. జాతీయ రహదారులపై ఏర్పాటు చేస్తున్న ఈ ఫెన్సింగ్‌కు ప్రత్యేకమైన బాంబుసా బాల్కో వెదురు జాతులకు సంబంధించిన కర్రను ఉపయోగిస్తారు. దీనికి క్రియోసోట్ నూనెతో శుద్ధిచేస్తారు. రీసైకిల్ చేసిన దీనికి హైడెన్సిటీ పాలీఇథలిన్‌తో పూత పూస్తారు. దీంతో ఈ క్రాష్ బ్యారియర్ ఉక్కుకు సరైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుంది.

ప్రయోగాత్మకంగా

జాతీయ రహదారులపై పశువులు ఇతర మూగజీవాల కారణంగా కలుగుతున్న ప్రమాదాలను కొంతమేరకైనా నివారించేందుకు ప్రయోగాత్మకంగా దేశంలోనే మొట్టమొదటిసారిగా మహారాష్ట్రలోని చంద్రపూర్-యావత్‌మాల్ జిల్లాలను కలిపే జాతీయ రహదారిపై వెదురు బొంగులతో ప్రత్యేక ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ ఫెన్సింగ్‌తో సత్ఫలితాలు వచ్చినట్టు కేంద్ర రహదారి, రవాణా మంత్రిత్వశాఖ అధికారులు భావించారు. మొట్టమొదటిసారిగా ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ ఫెన్సింగ్‌తో సత్ఫలితాలు రావడంతో ఇతర రాష్ట్రాల్లోని జాతీయ రహదారులపై కూడా ఇలాంటి కంచెను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా తెలంగాణలో మొదటిసారిగా హైదరాబాద్-నాగ్‌పూర్ 44వ జాతీయ రహదారిపై ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వెదురు బొంగులతో ప్రత్యేకమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా రాష్ట్రంలోని మరికొన్ని జాతీయ రహదారులపై కూడా ఇలాంటి ప్రత్యేక ఫెన్సింగ్‌లను ఏర్పాటు చేసేందుకు అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో

దేశంలోనే అత్యంత రద్దీ రహదారుల్లో ఒకటిగా ఉన్న హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై నిత్యం ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. ఈ రహదారిలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే దండుమల్కాపురం నుంచి నందిగామ వరకు 17 ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌గా గతంలో అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల పరిధిలో నిత్యం ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు.ఇలాంటి ప్రాంతాల్లో ప్రత్యేకంగా వెదురు బొంగులతో బాహుబలి ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసే యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో పశువులు పెంపుడు జంతువులు, అనుకోకుండా జరిగే ప్రమాదాలను కనీస స్థాయికి తీసుకురావడానికి ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

ప్రమాదాల నివారణకు వెదురు కంచెలు దోహదం

జాతీయ రహదారిపై ఏర్పాటు చేయనున్న వెదురు కంచెతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి ఈ కంచెలు ఉపయోగపడతాయి. అదేవిధంగా జాతీయ రహదారి పైకి వచ్చే పశువులు, జంతువులు, ఇతర మూగజీవాలకు అడ్డుకట్ట వేయవచ్చు. వీటిద్వారా సంభవించే ప్రమాదాలను సైతం కొంత మేర నివారించవచ్చు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై మల్కాపురం నుంచి నందిగామ వరకు గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద రూ.300కోట్ల వ్యయంతో ప్రమాదాల నివారణకు త్వరలో చర్యలు చేపట్టనున్నారు. వీటికి సంబంధించి 15 రోజుల్లో టెండర్లు పూర్తవుతాయి. టెండర్లు పూర్తి కాగానే పనులు ప్రారంభమవుతాయి.

- శ్రీధర్‌రెడ్డి, జీఎంఆర్ ప్రతినిధి



యాదగిరి క్షేత్రంలో

శివోహం

- 5నుంచి 10వ తేదీ వరకు శివాలయంలో మహాశివరాత్రి వేడుకలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు



జిల్లా ఆడిట్ కార్యాలయంలో

అగ్నిప్రమాదం

- విలువైన ఫైళ్లు, కంప్యూటర్లు దగ్ధం
- ప్రమాదంపై పలు అనుమానాలు
- షార్ట్‌సర్క్యూట్ కారణమంటున్న ఆడిట్ అధికారి

•7లో..



వైభవంగా దయానంద సరస్వతి

ద్విశత జయంతి

- 200 యజ్ఞ కుండలాల పారాయణం ప్రారంభం
- హాజరైన స్వామి ప్రణవానంద సరస్వతి, స్వామి ఆర్యవేశ్

సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నల్లగొండ టౌన్, మార్చి 1: రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం పథకంలో భాగంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి డీజీపీ రవిగుప్త, ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ద్వారా అర్హులైన వారికి ప్రయోజనం చేకూరేలా ఎంపీడీవో, మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను వెంటనే ఏర్పాటుచేయాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోలేకపోయిన అర్హులు ఈ కేంద్రాల్లో దరఖాస్తు సమర్పించవచ్చన్నారు. ఈ కేంద్రాల్లో ఇంటర్నెట్ సదుపాయంతో కూడిన కంప్యూటర్ ఏర్పాటు చేయాలని, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలని, ప్రతీ రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్ర 5గంటల వరకు వీటిని తెరిచి ఉంచాలన్నారు. అదేవిధంగా దరఖాస్తుల్లో సరైన వివరాలు పొందుపరచలేకపోయిన వాటిని సవరించి అప్‌లోడ్ చేయాలన్నారు. వంట గ్యాస్ ఏజెన్సీ, వినియోదారుడి పేర్లను రేషన్‌కార్డు వివరాలు, మొబైల్ నంబరు తదితరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంటర్మీడియట్‌తో పాటు మార్చి 18నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పరీక్షల్లో పొరపాట్లు, అంవాఛనీయ ఘటనలు జరగకుండా, సెల్‌ఫోన్లు అనుమతించకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కాపీయింగ్‌కు అవకాశం లేకుండా అక్రమాలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. పరీక్షలు ముగిసే వరకు నిర్వహణ తీరును నిత్యం సమీక్షించాలని కలెక్టర్లకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, కాపీయింగ్ జరిగే అవకాశం ఉన్నచోట అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనదీప్తి, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీసీవో మురళి, డీఈవో భిక్షపతి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దస్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న శాంతికుమారి

జిల్లా వ్యాప్తంగా జీరో విద్యుత్ బిల్లులు జారీ

నల్లగొండ టౌన్, మార్చి 1: ఎన్నికల హామీ మేరకు ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అమలులోకి వచ్చింది. అర్హులైన వినియోగదారులందరికీ విద్యుత్ సిబ్బంది జీరో బిల్లుల జారీ ప్రక్రియ ప్రారంభించారు. తెల్ల రేషన్‌కార్డు ఉండి 200 యూనిట్ల కంటే తక్కువగా విద్యుత్‌ను వినియోగించే వినియోగదారులకు ఈ జీరో బిల్లును జారీ చేస్తున్నారు. అయితే 200 యూనిట్లకు ఒక్క యూనిట్ అధికంగా వాడినా మొత్తం బిల్లు జారీచేస్తున్నారు. గృహజ్యోతి జీరో బిల్లులకు విద్యుత్ శాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 4.12లక్షల గృహ విద్యుత్ వినియోగదారులు ఉండగా, వారిలో 1.89లక్షల మంది గృహజ్యోతి పథకానికి అర్హత సాధించారు. కాగా జిల్లా కేంద్రంలో బిల్లుల జారీ ప్రక్రియను విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రమోహన్, డీఈ వెంకటేశ్వర్లు, ఏడీ శంకరయ్య పరిశీలించారు. గృహజ్యోతి పథకానికి అర్హత కలిగి ఉండి, జాబితాలో పేరు లేని వారు మరోసారి మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

టీపీడీసీఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా సూర్యనారాయణరెడ్డి

భువనగిరి టౌన్, మార్చి 1: రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్(టీపీడీసీఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలోని జాగృతి డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సూర్యనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఈ మేరకు ఆయనతో పాటు అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రావు, కార్యదర్శి రామకృష్ణ, ప్రమాణస్వీకారం చేశారు. ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందేలా, యాజమాన్యాల ప్రయోజనాలు కాపాడేలా నూతన కమిటీ పని చేస్తోందని సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు అభినందించారు.



ప్రమాణ స్వీకారం చేసిన నూతన అధ్యక్షుడు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి(మధ్యలో వ్యక్తి), వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రావు, కార్యదర్శి రామకృష్ణ (ఎడమచేతి వైపు)

తాగునీటి ఇబ్బంది కలగకుండా చూడాలి

కలెక్టర్ హరిచందన



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ టౌన్, మార్చి 1: వేసవిలో తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిచందన గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. పంచాయతీ ట్రాక్టర్లను ప్రత్యేక అధికారులు వారి నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. ప్రతీ గ్రామానికి తాగునీటి వనరులను గుర్తించాలని, పూర్తిగా క్లోరినేషన్ చేసిన తర్వాత తాగునీటిని ప్రజలకు అందించాలన్నారు. ఎక్కడైనా పంపులు మరమ్మతుకు గురైతే వెంటనే స్పందించాలన్నారు. నీరు వచ్చేందుకు అవకాశం ఉన్న బోర్లను మాత్రమే ఫ్లషింగ్ చేయాలని, కొత్త బోర్లు వేయవద్దని ఆదేశించారు. ప్రతీ గ్రామానికి సవరించిన సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయాలన్నారు. వేసవి కారణంగా మొక్కలు ఎండిపోయే అవకాశం ఉన్నందున క్రమం తప్పకుండా నీరు పెట్టాలన్నారు. ప్రతీ నర్సరీలో మొక్కలకు ఎండ తగలకుండా నీడ ఏర్పాటుచేయాలన్నారు. ఉపాధి హామీ పథకం పనులను గుర్తించడమేగాక, కూలీలకు పనులను పెంచాలని, ఎక్కువ మంది హాజరయ్యేలా చూడాలన్నారు. ఫాం పాండ్స్, చెరువు పనులు నిర్వహిస్తే వచ్చే వర్షాకాలంలో నీరు నిల్వ ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకు ప్రతి గ్రామానికి ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారులు గ్రామాలకు వెళ్లి శానిటేషన్‌తో పాటు, తాగునీరు, మొక్కలకు నిరంతరం నీరు అందించడం, వీధిలైట్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్యానికి సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ద్వారా ప్రతిరోజు ఫొటోలను అప్

ఇంటర్ పరీక్షలకు 13,902మంది హాజరు

నల్లగొండ, మార్చి 1: ఇంటర్ మొదటి సంవత్సరం శుక్రవారం జరిగిన ఇంగ్లీష్ పేపర్-1 పరీక్షకు 14,496మందికి 13,902మంది విద్యార్థులు హాజరయ్యారు. 594మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 12,411మందికి 11,997మంది హాజరు కాగా, 414మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,085మందికి 1,905మంది హాజరు కాగా, 180మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు : డీఐఈవో దస్రునాయక్

ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దని డీఐఈవో ఆర్.దస్రునాయక్ అన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఒత్తిడికి లోనుకాకుండా కళాశాల ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు తగిన సూచనలు చేయాలని, మానసిక వైద్యుల నిపుణుల సూచనలు తీసుకోవాలని కోరారు.



హుజూర్‌నగర్ వాసి మోహన్‌సాయికి ఇస్రో అవార్డు


- ● అనలాగ్ ఆస్ట్రోనాట్ అంశంపై ఉపన్యాసం
- ● బెస్ట్ ప్రజంటేషన్‌గా ఎంపిక

హుజూర్‌నగర్, మార్చి 1 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన మోహనసాయిని బెస్ట్ ప్రజంటేషన్‌తో ఇస్రో సత్కరించింది. 22వ స్పేస్ సైన్స్ సింపోజియం-2024 ప్రోగ్రామ్‌ను గోవా యూనివర్సిటీలో ఫిబ్రవరి 26వ తేదీ నుంచి శుక్రవారం నిర్వహించారు. ఇందులో అనలాగ్ ఆస్ట్రోనాట్ అంశంపై మోహన్‌సాయి ప్రజంటేషన్ ఇచ్చారు. పోలాండ్ దేశంలోని క్రాక్రో నగరంలో గత ఏడాది ఆగస్టు 11 నుంచి 28 వరకు మోహన్‌సాయి పరిశోధనకు సంబంధించి రీసెర్చ్‌ను కాన్ఫరెన్స్‌లో వివరించారు. ఇందుకు గాను బెస్ట్ ఫిజికల్ రీసెర్చ్ లాబోరేటరీ డైరక్టర్ డాక్టర్ అనిల్ భరద్వాజ్ నుంచి బెస్ట్ ప్రజంటేషన్ అవార్డును మోహనసాయి అందుకున్నారు. దేశంలోని 15 రాష్ట్రాలకు చెందిన 300 మంది ఈ సింపోజియంకు దరఖాస్తు చేసుకోగా 50 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కాగా 48మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో మోహన్‌సాయి బెస్ట్ ప్రజంటేషన్ అవార్డు సాధించారు. కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్, మాజీ చైర్మన్ శివణ్, ఫార్మర్ చైర్మన్ ఏ.ఎస్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. అంతరిక్ష పరిశోధలనకు సంబంధించి అనేక అంశాలపై రీసెర్చ్ చేస్తున్న మోహనసాయి కాన్ఫరెన్స్‌లో బెస్ట్ ప్రజంటేషన్ అవార్డు సాధించడంపై తల్లిదండ్రులు ఆకుల శ్రీనివాస్, నాగజ్యోతి సంతోషం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మోహన్‌సాయి ఈ నెల 13 నుంచి 30 వరకు లునారెస్ అన్‌లాగ్ ఆస్ట్రోనట్ అంతరిక్ష మిషన్‌లో రెండోసారి పరిశోధనలు చేయనున్నారు. సుమారు 17 రోజుల పాటు అంతరిక్షంలో పరిశోధనలు చేసి, మానవ జీవన ప్రమాణాలు అంతరిక్షంలో మెరుగుపర్చుకునే అంశంపై ఒక నివేదికను తయారు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మోహన్‌సాయి ముంబైలోని అమిటీ యూనివర్సిటీలో మాస్టర్స్ ఇన్ ఆస్ట్రోబయోలజీ అండ్ స్పేస్ సైన్స్‌లో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దేశంలో ఈ విద్యాసంవత్సరం నుంచి ఈ కోర్సును ప్రారంభించగా దేశం మొత్తంలో 9 మంది అభ్యసిస్తున్నారు. అందులో మోహనసాయి ఒకరు.



బెస్ట్ ప్రజంటేషన్ అవార్డుతో మోహన్‌సాయి

నేడు రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక

గరిడేపల్లి, మార్చి 1: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులకు నేడు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు డీసీవో పద్మ తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీన రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌పై కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. కానీ ఆ ఫలితాన్ని ప్రకటించే సమయానికి మాజీ చైర్మన్ హైకోర్టు నుంచి స్టేఆర్డర్ తేవడంతో కోర్టు ఆదేశాల ప్రకారం అప్పటి డీసీవో శ్రీధర్ చైర్మన్ ప్రకటనను తాత్కాలికంగా ఫిబ్రవరి 5వ తేదీ వరకు వాయిదా వేశారు. అనంతరం 5న ఫలితాన్ని ప్రకటించాల్సి ఉండగా కోర్టు మరోసారి 9కి వాయిదావేసింది. ఆ తర్వాత మళ్లీ 15, తదుపరి 22కు ఇలా వాయిదా పడుతూ వచ్చిన వచ్చింది. అవిశ్వాస ఫలితం ప్రకటనతో పాటు చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నికకు కోర్టు ఆమోదం తెలపడంతో ఎన్నిక నిర్వహిస్తున్నట్లు డీసీవో తెలిపారు. శనివారం కీతవారిగూడెంలోని కార్యాలయంలో మధ్యాహ్నం 2.30 గంటలకు ఎన్నిక నిర్వహిస్తామని డీసీవో తెలిపారు. కొంతకాలంగా ఎదురుచూస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ఎన్నికకు నేడు సుగమమం కావడంతో అధికార కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

















యాదగిరి క్షేత్రంలో 'శివోహం'

ఈ నెల 5నుంచి 10వ తేదీ వరకు మహాశివరాత్రి వేడుకలు

యాదాద్రి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో ఈ నెల 5వ తేదీ నుంచి మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం కానున్నాయి. యాదగిరీశుడి కొండపైన పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి (శివాలయం) ఆలయంలో ఈ నెల 5 నుంచి నుంచి 10వ తేదీ వరకు పాంచాహ్నిక దీక్షతో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శివరాత్రి మహోత్సవాలు శైవాగమ సంప్రదాయ పద్ధతిలో అంగరంగ వైభవంగా కొనసాగనున్నాయి. శివరాత్రిని పురస్కరించుకుని దేవస్థానాన్ని మామిడి, అరటి తోరణాలతో తీర్చిదిద్దనున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ నెల 5న మంగళవారం ఉదయం 10.30గంటలకు సంప్రదాయరీతిలో విష్వక్సేనుడికి తొలిపూజలతో శివరాత్రి మహోత్సవాలకు శ్రీకారం చుడతారు. స్వస్తిపుణ్యాహవాచనం, కంకణధారణ, అఖండ దీపారాధన, రుత్వికరణపర్వాలు నిర్వహిస్తారు. రెండో రోజు 6వ తేదీన ధ్వజపటారోహణం, భేరీపూజ, దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ, మూడోరోజు 7వ తేదీ మధ్యాహ్నం 3.50గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రుద్రహవనం, రాత్రి 7గంటలకు శివకల్యాణ పర్వాలు, నాలుగోరోజు 8వ తేదీన అభిషేక పూజలు, రాత్రి లింగోద్భవ కాలంలో మహన్యాసపూర్వక శతరుద్రాభిషేక పూజలు, ఐదోరోజు 9వ తేదీ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లక్షబిల్వార్చన, రాత్రికి రథపటోత్సవం, ఆరో రోజు 10వ తేదీ మధ్యాహ్నం మహాపూర్ణాహుతి, రాత్రికి డోలోత్సవంతో మహాశివరాత్రి మహోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

కల్యాణంలో పాల్గొనేందుకు..

మహాశివరాత్రి మహోత్సవాల్లో ఈ నెల 7న నిర్వహించే శివకల్యాణోత్సవంలో పాల్గొనేందుకు రూ.516 చెల్లించాల్సి ఉంటుంది. అదే విధంగా 8న మహాశివరాత్రి రోజున అభిషేక పూజలకు రూ.350, రాత్రి మహన్యాస పూర్వక శతరుద్రాభిషేక పూజలకు రూ.516, 9వ తేదీన లక్ష బిల్వార్చన పూజల్లో పాల్గొనే దంపతులు రూ.516 చెల్లించి పాల్గొనాలి.

జిల్లా ఆడిట్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

» విలువైన ఫైళ్లు, కంప్యూటర్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నల్లగొండ, మార్చి 1: నల్లగొండ జిల్లా పరిషత్ కార్యాలయంలోని పాత భవనంలో ఉన్న ఆడిట్ కార్యాలయంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత అగ్నిప్రమాదం జరిగింది. దీంతో విలువైన కంప్యూటర్లు, ఫైళ్లు, ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఆడిట్ కార్యాలయంలో స్థానిక సంస్థలకు చెందిన అభివృద్ధి పనులు, ఇతర ఖర్చులపై ఆడిటింగ్ నిర్వహిస్తారు. గ్రామపంచాయతీలు, మార్కెట్ కమిటీలు, దేవస్థానాలు, ఇతర లోకల్‌బాడీలకు సంబంధించిన ఫైళ్లు, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రాత్రి 11.30 నుంచి 12 గంటల మధ్యలో సీనియర్ అసిస్టెంట్ ఒకరు విధులు నిర్వహించినట్లు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. సదరు ఉద్యోగి బయటకు వెళ్లే సమయంలో జడ్పీ పాత భవన్‌లో మంటలు చెలరేగడంతో ఆ ఉద్యోగి ఉన్నతాధికారులకు సమాచారం అందజేశాడు. అదేవిధంగా చుట్టుపక్కల వారు కూడా కార్యాలయంలో మం టలు రావడంతో పోలీసులకు, ఫైర్‌స్టేషన్ వాళ్లకు సమాచారం అందజేశారు. దీంతో వారంతా హుటాహుటిన కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే కార్యాలయంలో ఫైళ్లు, కంప్యూటర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. అధికారులు మాత్రం కంప్యూటర్లు, ఫైళ్లు దగ్ధమైనా పూర్తి సమాచారం ఇతర సిస్టమ్‌లలో ఉంటుందని, ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొంటున్నారు. ఐదేళ్లకు చెందిన సమాచారం అంతా ఆన్‌లైన్‌లో నమోదైంది. ఈ ప్రమాదం జరగడానికి షార్ట్ సర్క్యూట్‌తో పాటు పాత భవనం అయినందున వైరింగ్‌లో లోపాలు ఉన్నాయా, లేదంటే ఎవరైనా కావాలని అగ్నిప్రమాదం ఘటన సృష్టించారా అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాద ఘటనపై జిల్లా ఆడిట్ అధికారి పి.కృపాకర్‌రావు మాట్లాడుతూ 70 సంవత్సరా ల పురాతన భవనం కావడంతో షార్ట్‌సర్క్యూట్‌తో ఈ ప్రమాదం చోటు చేసుకుందని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదన్నారు.

వేతనాలు అడిగితే తొలగించారు

» ముగ్గురు అవుట్ సోర్సింగ్ కార్మికుల ఆత్మహత్యాయత్నం » అకారణంగా తొలగించారని ఆరోపణ

నల్లగొండటౌన్, మార్చి 1: వేతనాలు అడిగితే అకారణంగా విధుల నుంచి తొలగించారని ముగ్గురు అవుట్‌సోర్సింగ్ మహిళా సిబ్బంది ఆత్మహత్యాయత్నం చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రప్రభుత్వ ఆసుపత్రిలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో హైదరాబాద్‌కు చెందిన సాయి ఏజెన్సీ శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ ఐదేళ్లుగా కాంట్రాక్టును దక్కించుకుని పనులు నిర్వహిస్తుంది. ఏడాది కిత్రం ఇదే వర్క్‌ను మరో సంస్థ సబ్‌కాంట్రాక్టు తీసుకుని పనులు కొనసాగిస్తుంది. సదరు ఏజెన్సీ నిర్వాహకుడు వెంకన్న తమ వేతనాల్లో కోతలు విధిస్తున్నాడని ఇటీవల ఆసుపత్రికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశానుసారం కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వాలని ఆసుపత్రి అధికారులు ఏజెన్సీ నిర్వాహకుడిని ఆదేశించారు. దీంతో ఏజెన్సీ నిర్వాహకుడు 400పడకల ఆసుపత్రిలో 180 మందికి గాను 183 మంది పనిచేస్తున్నారంటూ అదనంగా ఉన్న ముగ్గురిని తొలగించేందుకు నిర్ణయించినట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. వల్కి లలిత, మారం నాగమణి, బోడ జానకిలను విధుల నుంచి తప్పించేందుకు వారికి రావాల్సిన పూర్తి వేతనాన్ని చెల్లించారని, ప్రతీ నెలా మొదటి తేదీన వేసే డ్యూటీ చార్ట్‌లో తమ పేర్లు తీసివేశారని ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆసుపత్రిలో ధర్నా చేశారు. ముగ్గురు కార్మికులు గుర్తుతెలియని టాబ్లెట్స్ మింగి ఆత్మహత్యాయత్నం చేయగా, సిబ్బంది చికిత్స చేయడంతో ప్రాణాపాయస్థితి తప్పింది. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ నిత్యానందం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకుంటామని, వేతనాలతో తమకు సంబంధం లేదన్నారు. ఏజెన్సీ నిర్వాహకుడు వెంకన్న మాట్లాడుతూ కార్మికులు ఎక్కువ ఉన్నా తాము ఎవ్వరినీ తొలగించాలని అనుకోలేదన్నారు. కార్మికులు ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు పాలడుగు నాగార్జున, ప్రభావతి, తదితరులు ఆస్పత్రికి చేరుకుని వారిని పరామర్శించారు.

మహాశివరాత్రికి ఏలేశ్వరం కొండకు లాంచీలు

పెద్దలకు రూ. 200, పిల్లలకు రూ.150 టికెట్టు ధర

నాగార్జునసాగర్, మార్చి 1: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జలాశయం మధ్యలో ఉన్న శ్రీ కాత్యాయనీ సమేత ఏలేశ్వరస్వామి మల్లయ్య గట్టుకు ప్రత్యేక లాంచీలు నడపనున్నట్లు పర్యాటకశాఖ అధికారులు తెలిపారు. హిల్‌కాలనీ విజయ్‌విహార్ వెనక వైపున ఉన్న కొత్త బోటింగ్ పాయింట్ నుంచి ఉదయం 6 నుంచి సాయత్రం 4 గంటల వరకు లాంచీలు నడపనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం పెద్దలకు రూ. 200, 4 నుంచి 10 సంవత్సరాలలోపు పిల్లలకు రూ.150 టికెట్ ధర నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

వైభవంగా స్వాతి నక్షత్ర పూజలు

● అలంకార మూర్తులకు అష్టోత్తర శతఘటాభిషేక పూజలు ● నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం ● స్వామికి 250గ్రాముల రెండు బంగారు కిరీటాల బహూకరణ





స్వయంభువులను అభిషేకించేందుకు మహాకుంభ కలశాన్ని తీసుకువెళుతున్న అర్చకులు, బంగారు కిరీటాలు బహూకరిస్తున్న దాతలు

యాదగిరిగుట్ట, మార్చి1: ఏకశిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకొని అష్టోత్తర శతఘటాభిషేక పూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. ప్రభాతవేళ సుప్రభాతంతో గర్భగుడిలోని స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు ప్రధానాలయ ముఖమండపంలో 108 కలశాలను ఏర్పాటు చేసి గంగాది సప్తనదీ జలాలను, మామిడి, తమలపాకులు, దర్భలు, పూలమాలలు, కొబ్బరికాయలతో అలంకరించి ఆయా దేవతల మూలమంత్ర పఠనాలతో హోమ పూజలు చేశారు. గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభుమూర్తులను, సువర్ణ ప్రతిష్ఠా అలంకారమూర్తులను వేదమంత్రాలతో అష్టోత్తర శతఘటాభిషేక పూజలు నిర్వహించి సువర్ణ పుష్పాలతో అర్చించారు. అష్టోత్తర శతఘటాభిషేక పూజలనంతరం అర్చకులు యాదగిరిక్షేత్ర మహాత్మ్యాన్ని భక్తులకు వివరించారు. సాయంత్రం స్వాతి జన్మ నక్షత్రం సందర్భంగా స్వామిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా నృసింహుడి జన్మనక్షత్రం సందర్భంగా భక్తులు, స్థానికులు కొండచుట్టూ గిరిప్రదక్షిణలు చేసి కొండపైన ప్రధానాలయంలోని మూలమూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా అనుబంధ పాతగుట్ట దేవాలయంలోనూ స్వాతి జన్మనక్షత్రోత్సవం సందర్భంగా విశేషపర్వాలు వైభవంగా కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.18,19,053 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

అద్దాల మండపంలో ప్రత్యేక పూజలు

యాదగిరికొండపైన శుక్రవారం ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. సాయంత్రంవేళ ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ఊంజల్ సేవలో తీర్చిదిద్దారు. ఆలయ తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహించిన అద్దాల మండపంలో అధిష్ఠింపజేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు, యాగశాలలో చండీ హవనం స్మార్త సంప్రదాయరీతిలో నిర్వహించారు.

బంగారు కిరీటాల బహూకరణ

యాదగిరీశుడికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు తడకమల్ల కృష్ణమూర్తి, లక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు సుమారు 250 గ్రాముల బంగారంతో తయారుచేసిన రెండు కిరీటాలు, ఒక అభయ హస్తాన్ని కానుకగా సమర్పించారు. ముందుగా దాత కుటుంబ సభ్యులతో కలిసి గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకుని స్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా మొక్కు కానుకలను ప్రధానాలయ ముఖమండపంలోని ఉత్సవమూర్తుల చెంత ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావులకు అందజేశారు. దాత అందజేసిన బంగారు కిరీటాలను, అభయ హస్తాన్ని అర్చకస్వాములు సంప్రదాయరీతిలో సంప్రోక్షణ పూజలు నిర్వహించిన అనంతరం నిత్యకల్యాణమూర్తులకు అలంకరించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. వీరివెంట దాత కుటుంబసభ్యులు యశ్వంత్‌కుమార్, భవాని దంపతులు, శ్రీవల్లి, మహాలక్ష్మి, దేవస్థాన అధికారులు తదితరులున్నారు.

డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల సమస్యను పరిశీలించాలి

● సీఎం రేవంత్‌కు నిరుద్యోగుల వినతి

చౌటుప్పల్ టౌన్, మార్చి 1: డీఎస్సీ-1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు తమకు ఉద్యోగాలు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం రాత్రి సీఎంను డీఎస్సీ-1998 క్వాలిఫైడ్ అభ్యర్థుల అసోసియేషన్ సలహాదారుడు మన్నె నర్సింహారెడ్డి, జనరల్ సెక్రటరీ సంజీవ్ కుమార్‌లు కలిసి తమ సమస్యను వివరించారు. 1998లో నిర్వహించిన డీఎస్సీలో అర్హత సాధించిన 1500 మంది అభ్యర్థులకు టీచర్ ఉద్యోగాలు కల్పించలేదని, దీంతో అభ్యర్థుల వయోపరిమితి పెరిగి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదే ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వం డీఎస్సీ-98లో అర్హత సాధించిన 4,600 మంది అభ్యర్థులకు 2023లో ఉద్యోగాలను కల్పించిందని, ఏపీ మాదిరిగానే తెలంగాణలో కూడా టీచర్ ఉద్యోగాలను కల్పించి ఆదుకోవాలని కోరారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మన్నె నర్సింహారెడ్డి

వైభవంగా దయానంద సరస్వతి ద్విశత జయంతి మహాసభలు

» వేదమంత్రాలతో 200 యజ్ఞ కుండలాల పారాయణం ప్రారంభం
» హాజరైన స్వామి ప్రణవానందసరస్వతి, స్వామి ఆర్యవేశ్
» మహాసభలకు పలు రాష్ట్రాల నుంచి సాధువులు, ప్రతినిధులు



రామగిరిలో గల ఆర్యసమాజ్ మందిరంలో యజ్ఞాలు చేస్తున్న భక్తులు

నల్లగొండ కల్చరల్, మార్చి 1: నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ్ మందిరంలో మహర్షి దయానంద సరస్వతి ద్విశత జయంతి మహాసభలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 100మంది ఆచార్యులు, విద్యార్థినీ విద్యార్థులు వేద మంత్రోచ్చారణల మధ్య 200 యజ్ఞ కుండలాలతో యజుర్వేద పారాయణ యజ్ఞం సాగింది. వైదిక గురుకుల సంచాలకులు స్వామి ప్రణవానందస్వామి, ఢిల్లీ సర్వదేశిక ఆర్య ప్రతినిధి సభ స్వామి ఆర్యవేశ్‌లు హాజరై యజ్ఞ కుండలాల యజుర్వేద పారాయణ యజ్ఞాన్ని ప్రారంభించారు. ఆర్యసమాజ సంస్థాపకులైన స్వామి దయానంద సరస్వతి 200 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ద్విశత జయంతి ఉత్సవాలు, నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆర్యసమాజ్ మందిరం స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, హైదరాబాద్ మలక్‌పేట, డెహ్రాడూన్ రాష్ట్రాలలోని గురుకులాలకు చెందిన 100మంది ఆచార్య విద్యార్థినీవిద్యార్థులు 200 కుండలాలతో 1975 మంత్రోచ్చరణలతో యజ్ఞాన్ని సాగించారు. తొలిరోజు ప్రారంభమైన ఈ మహాసభలకు మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, హరియాణా, ముంబాయి, హైదరాబాద్, ఢిల్లీ ప్రాంతాలకు చెందిన సాధువులు ఆర్యసమాజ్ పండితులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అదేవిధంగా యజ్ఞాన్ని తిలకించేందుకు ఆర్యసమాజ సభ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావడంతో ఆ ప్రాంతమంతా నందడి నెలకొంది. ఆర్య ప్రతినిధి సభ, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ సౌజన్యంతో నిర్వహించే ఈ మహాసభలు నల్లగొండ ఆర్యసమాజ ప్రాంగణం కోలహలంగా మారింది. వేద విద్వాంసులు, సాధువులు, యజ్ఞ నిర్వాహకులు, గురుకుల ఆచార్యులు హాజరై మహాయజ్ఞం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్యసమాజ్ మందిర్ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్‌రావు, జిల్లా అధ్యక్షుడు బోయనపల్లి కృష్ణారెడ్డి, కార్యదర్శి జె.గోపాల్‌రెడ్డి, ఉప కార్యదర్శి లక్ష్మీనర్సింహారావు, కంది సూర్యనారాయణ, కె.శంకర్, ఎస్.రవిప్రసాద్, కోశాధికారి కోటయ్య, పండితులు ఆచార్య శక్తినందన్, దాసోజు నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.



యజుర్వేద పారాయణ నిర్వహిస్తున్న ఆర్యసమాజ సభ్యులు

నేడు స్వామి రాందేవ్ రాక

ఆర్యసమాజ ప్రాంగణంలో నిర్వహిస్తున్న దయానంద సరస్వతి జయంతి మహాసభలకు విశ్వ సిద్ధులైన యోగ గురువు స్వామి రాందేవ్ హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండో రోజు ఉదయం 9 గంటలకు 200 కుండలాలతో యజుర్వేద పారాయణ యజ్ఞం కొనసాగనుంది. ఈ యజ్ఞంలో స్వామి రాందేవ్ పాల్గొననున్నారు.

ఖిల్లాపై కాషాయ జెండాను ఎగురవేయాలి

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్‌కుమార్



బండి సంజయ్‌ని సత్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు భాస్కర్ తదితరులు

భువనగిరి టౌన్, మార్చి 1: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఖిల్లాపై కాషాయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న ఆయనకు స్థానిక బీజేపీ నేతలు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ స్థితిని తెలుసుకుని బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం చేయాల్సిన కృషిని వివరించారు. బండి మాట్లాడుతూ, కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం కొలువుదీరడం ఖాయమైందని, దీంతో స్థానిక అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాల్సిన ఆవశ్యకతను ఓటర్లకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు జల్లేపల్లి శ్యాంసుందర్‌రెడ్డి, చందా మహేందర్ గుప్తా, నాయకులు ఎంజాల పద్మయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ వర్ధంతి సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.

రాజీమార్గమే రాజమార్గం: ప్రిన్సిపల్ జడ్జి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి జీ రాజగోపాల్

సూర్యాపేటలీగల్, మార్చి 1 : రాజీమార్గమే రాజమార్గమని, రాజీ కుదుర్చుకునేందుకు వీలున్న అన్ని కేసులను ఇరుపక్షాల కక్షిదారులు ముందుకు వచ్చి సత్వరమే పరిష్కరించునే వీలును లోక్‌అదాలత్ కల్పిస్తుందని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి జీ రాజగోపాల్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక అదాలత్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల సత్వర రాజీపూర్వక పరిష్కారం కోసం నిర్వహించే లోక్ అదాలత్ ఈ నెల 16వ తేదీన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి పీ శ్రీవాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, జే శశిధర్, వసంత సత్యనారాయణపిళ్లె, బొల్లెద్దు వెంకటరత్నం, పీ వాణి పాల్గొన్నారు.

క్యాంప్‌లతో విద్యార్థుల్లో అవగాహన పెంపు

గరిడేపల్లి, మార్చి 1 : ఎన్ఎస్ఎస్ క్యాంప్‌ల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో అవగాహన సామర్థ్యం పెరుగుతుందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త పసుపుల మద్దిలేటి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని రాయినిగూడెం, కల్మపల్లి గ్రామాల్లో శీతాకాల ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంప్ నిర్వహణతో విద్యార్థుల్లో అన్ని విషయాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడుతుందని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం బీమార్జున్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం దొంతిరెడ్డి జానకిరెడ్డి, వీ వెంకటరెడ్డి, స్పెషలాఫీసర్ కురుమయ్య, కొత్తపల్లి నాగరాజు, శ్రీనివాసరావు, డార్టర్ నగేష్, వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో రాణించాలి



సీనియర్స్ జట్టు ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

హుజూర్‌నగర్, మార్చి 1 : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో రాణించాలని కబడ్డీ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రామచంద్రగౌడ్, ప్రధాన కార్యదర్శి నామా నరసింహారావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో టౌన్‌హాల్ జిల్లా సీనియర్ కబడ్డీ శిక్షణ ముగింపులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీనియర్స్ కబడ్డీ జిల్లా జట్టును ఎంపికచేశారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు నాగార్జునసాగర్‌లో నిర్వహించే రాష్ట్ర 70వ సీనియర్ కబడ్డీ పోటీల్లో జట్టు పాల్గొంటుందని తెలిపారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, సునీల్, మస్తాన్, శివనాగిరెడ్డి, వెంకటేశ్వరరావు, ఇమాం, అలీపాష పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తుంగతుర్తి, మార్చి 1 : తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామంలో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుడెల్లి వీరమల్లు ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగిసిపడి ఇల్లంతా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సామాగ్రి, టీవీ, బీరువా కాలిపోయాయి. దాదాపు రూ.లక్ష ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వీరమల్లు ఆవేదన వ్యక్తం చేశారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై నిలదీయాలి: బ్రజేష్‌పాఠక్



నల్లగొండ: విజయ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్‌పాఠక్

రామగిరి/సూర్యాపేట సిటీ/కోదాడ, మార్చి 1: కుంభకోణాలకు కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ అని, నరేంద్ర మోదీ దేశ ప్రధాని కాకముందు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందని ఉత్తరప్రదేశ్ ఉపముఖ్యమంత్రి బ్రజేశ్‌పాఠక్ అన్నారు. శుక్రవారం రాత్రి నల్లగొండ జిల్లాలో నిర్వహించిన బీజేపీ విజయసంకల్ప యాత్ర ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ఆ పార్టీల మంత్రులు జైలుకు వెళ్లిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన రాష్ట్ర ప్రభుత్వానికి ఆ హామీలను అమలయ్యేలా నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాంటి అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాడు దేశప్రజలు నరేంద్రమోదీని అఖండ మెజారిటీతో రెండుసార్లు గెలిపించారన్నారు. మూడోసారి కూడా ప్రజలు రెండుసార్లు కంటే ఎక్కువ మెజారిటీతో గెలిపిస్తారని అన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని కట్టి చూపించారన్నారు. మహిళల ఆత్మగౌరవం కోసం స్వచ్ఛభారత్ పేరిట మరుగుదొడ్లను నిర్మించినట్లు, ఇంటింటికీ మంచినీరు ఉజ్వల యోజన కింద కోట్లాది మందికి గ్యాస్ కనెక్షన్ ఇచ్చినట్లు వివరించారు. మోదీ ప్రవేశపెట్టిన ప్రతీ పథకం అట్టడుగు వర్గాలకు చేరుకుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నర్సింహారెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, శ్రీదేవిరెడ్డి పాల్గొన్నారు.

400 ఎంపీ స్థానాలను గెలుస్తుంది

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400 ఎంపీ స్థానాలను గెలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి అవడం ఖాయమని బీజేపీ రాష్ట నేత, విజయ సంకల్ప యాత్ర ప్రముఖ్ నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నా రు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు కోదాడ పట్టణానికి చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. గల్లీలో మనం క్షేమంగా ఉండాలంటే ఢిల్లీలో మోదీ ఉండాలన్నారు. గత ఎన్నికల్లో రాష్ట్రం నుంచి నాలుగు ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం లక్ష కోట్లు అభివృద్ధి పనులకు ఇచ్చిందన్నారు. ఈ ఎన్నికల్లో 15 సీట్లు ఇస్తే, అంతకన్నా రెట్టింపు నిధులు రాష్ట్రానికి తెచ్చుకోవచ్చన్నారు. 2500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను బీజేపీ ప్రభుత్వం నిర్మించిందన్నారు. బీఆర్ఎస్ దేశంలోనే అ వినీతి పాలన అందించిన రాష్ట్రంగా మారిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు, బీజేపీ కిసాన్ మోర్చ జాతీ య నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్ర సాద్, జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, పార్లమెంటు కో- కన్వీనర్ తుక్కాని మన్మథరెడ్డి, కోదాడ అసెంబ్లీ కన్వీనర్ కనగాల నారాయణ, సీనియర్ నాయకులు కనగాల వెంకట్రామయ్య, నూనె సులోచన, బొలిశెట్టి క్రిష్ణయ్య, మన్మథరెడ్డి, గార్లపాటి జితేంద్రకుమార్, యాదా రమేష్, ఓరుగంటి కిట్టు, వంగవీటి శ్రీనివాసరావు, చిలుకూరు శ్రీను, చల్లమళ్ల నరసింహా, పోలగాని ధనుంజయ్ గౌడ్, వెన్న శశిధర్‌రెడ్డి, పల్స మల్సూర్ గౌడ్, నలిగంటి వీరేందర్, నాగరాజు పాల్గొన్నారు.

భువనగిరి ఎంపీగా అమిత్‌రెడ్డి పోటీకి సిద్ధం

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



గుత్తా సుఖేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

భువనగిరి రూరల్, మార్చి 1: అధిష్ఠానం ఆదేశిస్తే భువనగిరి ఎంపీ అభ్యర్థిగా తన కుమారుడు అమిత్‌రెడ్డి పోటీకి సిద్ధమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని నమాత్‌పల్లి పూర్ణగిరి కొండపై సుదర్శన నారసింహస్వామి కల్యాణోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో మదర్‌డెయిరీ చైర్మన్‌గా,ఎంపీగా భువనగిరి ప్రజలకు మంచి సేవలు అందించానని, అదేవిధంగా ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉన్నానన్నారు. ఎంపీ టికెట్ విషయమై అధిష్ఠానంతో చర్చించినట్లు తెలిపారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తన కుమారుడు అమిత్‌రెడ్డికి అవకాశం వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవిస్తానని స్పష్టంచేశారు. సమావేశంలో భువనగిరి జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, బీఆర్ఎస్ నాయకులు జక్క రాఘవేందర్‌రెడ్డి, రమేశ్ గౌడ్, ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

అధికారులు స్థానికంగా ఉండాలి

● ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం, మార్చి 1: పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు వెళ్లాలన్నా, ప్రజా అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా జరగాలన్నా అధికారులు, సిబ్బంది స్థానికంగా నివాసం ఉండాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ గంట లక్ష్మమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దూరప్రాంతాల నుంచి వచ్చి ఉద్యోగం చేస్తానంటే కుదరదని, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సకాలంలో కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలన్నారు. స్థానికంగా ఉండని అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మండలంలో మూసీ పరిసర ప్రాంతాల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా అధికారులు అప్రమత్తం కావాలన్నారు. మండలంలోని భైరవునిబండ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించక ముందే కొంతమంది ఆక్రమించుకుని నివాసముంటున్నారని, వెంటనే రెవెన్యూ అధికారులు వారిని ఖాళీ చేయించాలన్నారు. వందేళ్ల చరిత్ర గల శాలిగౌరారం ప్రాజెక్టు మరమ్మతులపై తమకు పూర్తి సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ ఎర్ర రణీల, తహసీల్దార్ అన్వర్ హుస్సేన్, ఎంపీడీవో రేకల లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ కందుల అనిత, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దేవరకొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



గన్నేర్లపల్లిలో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, మార్చి 1: దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చందంపేట మండలం చెంచుకాల నీ, మూనావత్‌తండా, గన్నేర్లపల్లిలో రూ.2.11 కోట్లతో రోడ్లు, అంగన్‌వాడీ భవన నిర్మాణపనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. రేకులవలయంలో చెంచుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. చెంచుల సమస్యలను పరిష్కరిస్తానని హామీఇచ్చారు. దేవరకొండ నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో చిత్రియాల పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, ఎంపీపీ పార్వతి, జడ్పీటీసీ బుజ్జిలచ్చిరాం, వెంకటయ్యగౌడ్, సిరాజ్‌ఖాన్, శ్రీశైలంయాదవ్, హరికృష్ణ, లచ్చిరాం, లక్ష్మణ్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

వేములపల్లి, మార్చి 1: మండలంలోని ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు తనవంతుగా కృషి చేస్తానని ఎంపీపీ పుట్టల సునీత అన్నారు. మండలంలోని రావువారిగూడెం, రావులపెంట, శెట్టిపాలెం, కామేపల్లి గ్రామాల్లో శుక్రవారం రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామీణ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా రావులపెంట గ్రామంలో ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించి జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పల్లా వీరయ్య, డీసీసీ ఉపాధ్యక్షులు రావు ఎల్లారెడ్డి, బీరవెల్లి సతీష్‌రెడ్డి, మర్రి ఎలియాస్, పుట్టల శ్రీను, ఇరుగు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం ఎరువులు విక్రయిస్తే చర్యలు

● జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



ఎరువుల షాపులో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

కనగల్, మార్చి 1: నాసిరకం ఎరువులు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గల ఎరువుల దుకణాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతులకు విక్రయించి రశీదులను అందించాలని దుకాణదారులకు సూచించారు. పురుగు మందులు, ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో అమరేందర్‌గౌడ్, ఏఈఓలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై నిర్లక్ష్యం తగదు

ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తుల తులసీదాస్ మాదిగ

నల్లగొండటౌన్, మార్చి 1: ఎస్సీ వర్గీకరణపై కేంద్రప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తగదని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తుల తులసీదాస్ మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేడి నర్సింహ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం నిర్వహించనున్న మాదిగ, ఉపకులాల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని వారు కోరారు. శుక్రవారం సంఘ భవన్‌లో జిల్లా సదస్సు కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై కమిటీ వేస్తున్నామని స్వయంగా ప్రధాని మోదీ ప్రకటించి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ ఎలాంటి ఫలితం లేకపోవడం శోచనీయమన్నారు. బీజేపీ మోసపూరిత వాగ్దానాలను ఎండగడుతూ కేంద్రం మెడలు వంచి వర్గీకరణ సాధించుకుంటామన్నారు. అందులో భాగంగా నిర్వహించే జిల్లా సదస్సుకు మాదిగ, ఉపకులాలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు రామాజి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లెంల యాదయ్య, అధికార ప్రతినిధి పుల్లెంల ఏడుకొండలు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము గిరి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెపల్లి సత్యనారాయణ, పరంగి రజిత, బరిగెల యాదయ్య, కొండేటి నరేష్, కత్తుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ లక్ష్యం

శాలిగౌరారం, మార్చి 1: పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా హెరిటేజ్ డెయిరీ పనిచేస్తుందని ఆ సంస్థ హైదరబాద్ -2 రీజనల్ హెడ్ కేబీ నర్సింగ్‌రావు పేర్కొన్నారు. మండలం లోని గురజాలలో శుక్రవారం నిర్వహించిన పాడి రైతుల అవగాహన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. హెరిటేజ్ పాలకేంద్రం సభ్యత్వం పొందిన ప్రతీ రైతుకు రూ. 2 లక్షల ప్రమాదబీమా, సబ్సిడీ ద్వారా ఎరువులు, పశువుల దాణా అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉచితంగా పాల క్యానులు అందజేశారు. కార్యక్రమంలో కట్టంగూరు ప్లాంట్ మేనేజర్ అపోదు మహేష్‌బాబు, డెయిరీ నిర్వాహకులు ఎడ్ల శ్రీనివాస్, రైతులు వెల్మకంటి యాదయ్య, వెల్మకంటి కిష్టయ్య, ముత్తయ్య, సైదులు, రాజశేఖర్, వెంకన్న పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



జీరో బిల్లులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, తిరుమలగిరి(సాగర్), మార్చి 1: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని హాలియా, తిరుమలగిరి(సాగర్) మండలాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. హాలియా మునిసిపాలిటీ పరిధిలోని అనుములలో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500కే సబ్సిడీ గ్యాస్ పథకాలను అమలు చేసిందన్నారు. గృహజ్యోతి పథకం కింద అర్హులైన వారికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, వారికి జీరో బిల్లు వస్తుందన్నారు.

● నియోజకవర్గంలోని గ్రామాల సమగ్రాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. తిరుమలగిరి(సాగర్) మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామంలో శుక్రవారం రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, విద్యుత్ ఎస్ ఈ చంద్రమోహన్, డీఈ వెంకటేశ్వర్లు, ఏడీఈ రవీందర్‌రెడ్డి, నాయకులు యడవల్లి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎల్లయ్య, చంద్రకళ, ఆంజనేయులు, సైదులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్, నాయకులు లాలునాయక్, నాగరాజు, మునినాయక్, శౌరినాయక్, హచ్చునాయక్, నాగేందర్‌నాయక్, కొండలు, భీలునాయక్, బిక్కునాయక్, శివాజీ నాయక్, బిచ్యాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవచూపాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 1: అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ఒకరిపై ఒకరు రాజకీయ ఆరోపణలు చేసుకుంటూ కాలం వెల్లదీయడం సరికాదని, ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, కార్మికులు వివిధ వర్గాల ప్రజలు అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. భూగర్భ జలాలు అడుగంటి వరి పొలాలు నిట్టనిలువునా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ ప్రాజెక్టులో నీరు లేకపోయినా కుడి కాల్వకు 3 టీఎంసీల నీరు విడుదల చేయడం సరైంది కాదన్నారు. ఎడమ కాల్వ కింద పంట పొలాలు ఎండుతున్నా కాపాడలేని ప్రభుత్వం కుడికాల్వకు నీటిని విడుదల చేసుకుంటుంటే ఎలా ఊరుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. ఎడమకాల్వకు నీరు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని కోరారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. మరో రెండు పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు డబ్బీకార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రాగిరెడ్డి మంగారెడ్డి, భావండ్ల పాండు, తిరుపలి రాంమూర్తి, సత్యనారాయణరావు, వినోద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్, మార్చి 1: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సంఘ రీజియన్ చైర్మన్ కడియం రమేష్ మాట్లాడు తూ ఆర్టీసీ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను బాండ్ల రూపంలో గత ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఆయా బాండ్లను ఎన్‌క్యాష్ చేసుకునే వీలు కల్పిస్తామని, రూ.280కోట్లు మంజూరు చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని అన్నారు. ఉన్నతాధికారులు సైతం ఆయా బాండ్లను కార్యాలయంలో ఇవ్వాలని నోటీస్ బోర్డుల్లో పేర్కొన్నారు. కానీ స్పష్టమైన ఆదేశాలు లేనందున కార్మికులు, ఉద్యోగులు అయోమయానికి గురవతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చలసాని నాగేశ్వరరావు, బ్రిటీష్‌రెడ్డి, టీఎస్‌రెడ్డి, జనార్ధన్, పారిజాత, స్రవంతి, సైదులు, సోమయ్య, కేవైరెడ్డి, సుదర్శన్, గణేష్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడెం నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

● **దేవరకొండ:** ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియను పూర్తి చేయాలని ఆర్టీసీ డిపో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, మోతిలాల్, రమేష్, వెంకటయ్య పాటు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులందరికీ విద్యుత్ జీరో బిల్లులు



మాడ్గులపల్లిలో లబ్ధిదారులకు జీరో బిల్లులు అందజేస్తున్న అధికారులు

మిర్యాలగూడ అర్బన్, దామరచర్ల, మాడ్గులపల్లి, మార్చి 1: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలులోకి తీసుకువచ్చిన గృహజ్యోతి పథకం కింద అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి విద్యుత్ జీరో బిల్లుల జారీ ప్రక్రియను ముమ్మరం చేసినట్లు విద్యుత్‌శాఖ టౌన్, రూరల్ ఏడీఈలు కోడిరెక్క రవికుమార్, రవీందర్ రెడ్డిలు తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలోని చర్చిబజారులో శుక్రవారం లబ్ధిదారులకు జీరో బిల్లులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేసేందుదకు తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో 21 వేల మంది లబ్ధిదారులు ఉండగా, డివిజన్ పరిధిలో 84,211 మంది లబ్ధిదారులకు ఈ నెల నుంచి 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ఉచితంగా వాడుకోనున్నట్లు తెలిపారు. అర్హత కలిగి గృహజ్యోతి పథకం వర్తించని వారు తమ వివరాలను మునిసిపల్, మండల పరిషత్ కార్యాలయాల్లో సమర్పించి పథకం ప్రయోజనాన్ని పొందవచ్చన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని వినియోగదారుల కు సూచించారు. కార్యక్రమంలో ఏఈలు వెంకటేశ్వర్లు, అమర్‌సింగ్, వెంకట్‌రెడ్డి, లైన్‌ఇన్‌స్పెక్టర్లు మారం శ్రీనివాస్, సోమాచారి, మురళీమోహన్, సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, శౌరి, గోపి, రాధ, జానకి, భీమమ్మ పాల్గొన్నారు.

● దామరచర్ల మండల కేంద్రంలో గృహజ్యోతి పథకంలో భాగంగా లబ్ధిదారులకు విద్యుత్‌శాఖ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు జీరో బిల్లులు అందజేశారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బంటు కిరణ్, నాయకులు ఓర్సు వెంకటేశ్వర్లు, కందుల నర్సింహారెడ్డి, జనార్ధన్, మోహన్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుకున్న వారికి జీరో బిల్లులు అందించినట్లు ఏఈ మణిదీప్ తెలిపారు.

గురుకులం నుంచి తప్పించుకొని...

క్షేమంగా ఇంటికి చేరిన విద్యార్థిని

దామరచర్ల, మార్చి 1: పాఠశాల నుంచి వెళ్లిన విద్యార్థిని తాను సికింద్రాబాద్‌లో ఉన్నట్లు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వటంతో అధికారులు, తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం దామరచర్లలోని గిరిజన గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.... దామరచర్లలోని గిరిజన గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 14 సంవత్సరాల విద్యార్థిని ఉదయం 7.30 గంటల సమయంలో నీళ్ల ట్యాంకర్ కోసం ప్రహరీ గేటు తీశారు. ఆ సమయంలో అనుమతి లేకుండా ఓ విద్యార్థిని బయటకు వెళ్లింది. ఈ క్రమంలో పాఠశాల ఉద్యోగులు పోలీసులు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు వెతుకుతున్న క్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను సికింద్రాబాద్‌లో ఉన్నట్లు సమాచారం అందించింది. వెంటనే వారు అక్కడకు చేరుకొని బాలికను తీసుకొచ్చారు. బాలిక క్షేమంగా ఇంటికి చేరడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేములపల్లి, మార్చి 1: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న నాలుగు ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మాడ్గులపల్లి మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన చింతకుంట్ల వెంకట్‌రెడ్డి, గార్లపాటి ఉపేందర్‌రెడ్డి, నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, గడ్డం మారయ్య తమ ట్రాక్టర్ల ద్వారా గ్రామ శివారులో గల పాలేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఈ మేరకు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కరాటేపై ఆసక్తి పెరగడం శుభ పరిణామం

● సినీనటుడు సుమన్



బెల్టులు అందజేస్తున్న సినీనటుడు సుమన్

మిర్యాలగూడ టౌన్, మార్చి 1: కరాటేపై ఆసక్తి పెరగడం ఆహ్వానించదగిన పరిణామమని సినీనటుడు సుమన్ అన్నారు. సుమన్ ఇండియా షాటోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం రైస్ మిల్లర్స్ భవనంలో జరిగిన బెల్ట్ సెర్మనీకి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, గురుకుల పాఠశాలల విద్యార్థులను ప్రదానం చేసి మాట్లాడారు. కరాటే, మార్షల్ ఆర్ట్స్‌పై బాలికలు, మహిళలు ఆసక్తి చూపిస్తున్నారని, ఏటేటా శిక్షణ తీసుకునే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. తన పేరుతో అకాడమీ స్థాపించి నాలుగు దశాబ్దాలుగా మాస్టర్లు వేలాది మంది పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడం హర్షనీయమన్నారు. మాస్టర్లు బూడిద సైదులు, రామకృష్ణనాయక్ మాట్లాడుతూ సుమన్ ప్రోత్సాహంతోనే విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సాధినేని శ్రీనివాసరావు, హన్యానాయక్ సుమన్‌ను సన్మానించడంతో పాటు మాస్టర్లు సైదులు, రామకృష్ణలను అభినందించారు.

పోలా క్రాంతికి గీతం యూనివర్సిటీ డాక్టరేట్



క్రాంతి కుమార్

నార్కట్‌పల్లి, మార్చి 1: నార్కట్‌పల్లి మండలానికి చెందిన పరిశోధక విద్యార్థికి ఫార్మా విభాగంలో గీతం యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. పోలా వెంకటేశ్వర్లు, మంజుల దంపతుల కుమారుడైన పోలా క్రాంతికుమార్ ఆంధ్రప్రదేశ్‌లోని గీతం యూనివర్సిటీలో ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలో పరిశోధన చేశారు. 'ఆప్టిమైజేషన్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫ్ డయాసెరీన్ అండ్ అసిక్లోఫెనాక్ ట్రాన్‌ఫార్మోసల్ బై ఎంప్లాయింగ్ అసేసియా కాన్‌సిన్నా యాస్ నేచురల్ సర్‌ఫాక్టాంట్' (సర్వోత్తమీకరణం) అనే అంశంపై డాక్టర్ ఆర్.సంతోష్‌కుమార్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. దానిని గీతం యూనివర్సిటీకి క్రాంతికుమార్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ వ్యాసం జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమైంది. పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్‌ను పొందిన క్రాంతిని నార్కట్‌పల్లికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశం పురోగతి

చిట్యాల, మార్చి 1: ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశం పురోగతి చెందుతుందని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలనీ ఆ పార్టీ దళితమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య కోరారు. చిట్యాలలో శుక్రవారం నిర్వహించిన మెగా బస్తీ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ మరోసారి విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు.

ఎంజీయూ పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా

నల్లగొండరూరల్, మార్చి 1: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు మార్చి 4వ తేదీన జరగాల్సి ఉండగా మార్చి 11 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఉపేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విద్యార్థి సంఘాల అభ్యర్థన మేరకు ఉప కులపతి ఆచార్య గోపాల్‌రెడ్డి, ఇతర అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల వివరాలు, టైం టెబుల్‌ను ఎంజీయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

డీసీసీబీ సీఈవోగా శంకర్‌రావు



శంకర్‌రావు

నల్లగొండ, మార్చి 1: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) సీఈవోగా శంకర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన సీఈవో మదన్‌మోహన్ అనారోగ్య కారణాలతో సెలవులపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో నూతన సీఈవోగా రావుల పాటి శంకర్‌రావును నియమించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో పాటు పాలకవర్గం, ఉద్యోగుల సహకారంతో బ్యాంకును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కొత్త సీఈవోకు బ్యాంకుకు చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నాగరాజు



నాగరాజు

మిర్యాలగూడ టౌన్, మార్చి 1: ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన విద్యావేత్త శ్రీరామకవచం నాగరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర రాజధానిలోని ఓయూ రాంరెడ్డి ఆడిటోరియంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తనను ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రైవేట్ విద్యాలయాల సమస్యల పరిష్కారంతో పాటు విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మక్కామల రామ్మోహన్, గాదె రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, ఉపేందర్, వేణు ఆయన నియామకంపై హర్షం వ్యక్తం చేశారు.

బెల్ట్‌షాపులపై పోలీసులు దాడి

మునుగోడురూరల్, మార్చి 1: మండల పరిధిలోని చీకటిమామిడి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు బెల్ట్‌షాపులపై దాడి చేశారు. అదే గ్రామానికి చెందిన నీల శేఖర్ బెల్ట్‌షాపులో మద్యం పట్టుబడినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మద్యం విక్రయిస్తున్న సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడ టౌన్: ఎన్టీఆర్ మునిసిపల్ కాంప్లెక్స్‌లో దుకాణాలను తమకు అప్పగించాలని దుకాణాదారులు కోరారు. 2018లో నిర్వహించిన వేలంలో నిబంధనల ప్రకారం దుకాణాలు దక్కించుకున్న తమకు నేటికీ దుకాణాలు అప్పగించకపోడం సరికాదన్నారు. షాపులు అప్పగించకపోవడంతో పాతఓనర్లు తమను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

త్రిపురారం: మండలంలోని బాబుసాయిపేటలో వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణానికి హాజరై భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తుల కోసం దేవాలయం వద్ద ప్రత్యేక ఏర్పాటు చేశారు.

చిట్యాల: చిట్యాల పట్టణంలోని పోతరాజు చెరువును పునరుద్ధరించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎండీ అక్బర్ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో చెరువును పరిశీలించారు. మునిసిపాలిటీలో సేకరించిన వ్యర్థాలను అందులో వేయడం వల్ల కాలుష్యకారకంగా మారిందన్నారు.

మిర్యాలగూడ: మక్కా హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలకు పట్టణంలోని చిన్న మసీదులో శిక్షణ నిర్వహిస్తున్నట్లు డివిజన్ హజ్ సొసైటీ కార్యదర్శి ఎం.డి అర్షద్‌ఖాన్ తెలిపారు. చిన్నమసీదులో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తొలివిడత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

తిరుమలగిరి(సాగర్): మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులను ప్రారంభించి నడపాలని సీపీఎం సీనియర్ నాయకుడు వేములకొండ పుల్లయ్య, మాజీ సర్పంచ్ పోలెపల్లి సైదమ్మ డిమాండ్ చేశారు. ప్రభుత్వం పల్లెలకు ఆర్టీసీ బస్సులను నడుపుతామని హామీ ఇచ్చి నేటికి నెరవేర్చలేదని ఆయన విమర్శించారు.

మాడ్గులపల్లి: మండలంలోని చెరువుపల్లి గ్రామంలో రూ.10లక్షతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను జడ్పీటీసీ పుల్లెంల సైదులు ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

దామరచర్ల: మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీలకు ఇవ్వాలని బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కెట్ చైర్మన్ పదవి మూడు పర్యాయాలుగా ఒకసారి ఎస్టీకి, ఒకసారి జనరల్ స్థానంగా, మరొకసారి ఎస్సీకి రిజర్వేషన్ చేసిందని తెలిపారు. ప్రభుత్వం ఈ సారి బీసీకి రిజర్వేషన్ కావాల్సిన స్థానాన్ని జనరల్ స్థానానికి మార్చడంపై బీసీలను రాజకీయంగా అణచివేసే కుట్ర దాగి ఉందన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ ఎండి.శంషొద్దీన్ తనిఖీ చేశారు. మొత్తం 185 మందికి ఆరుగురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నోముల రామస్వామి తెలిపారు. విద్యార్థులకు మంచినీటి సౌకర్యంతో పాటు అన్ని వసతులు కల్పించాలని తహసీల్దార్ చీఫ్ సూపరింటెండ్‌ను ఆదేశించారు.

నార్కట్‌పల్లి: మండలంలోని తొండ్లాయి గ్రామానికి చెందిన జాల ఉపేందర్ రెండేళ్ల కిందట గుండెపోటుతో మృతి చెందాడు. ఉపేందర్ కుటుంబాన్ని ఆదుకుంటానని గతంలో ఇచ్చిన మాట మేరకు అతని భార్య స్వప్న, తల్లి జయమ్మలకు రూ.లక్ష ఆర్థిక సాయం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అందజేశారు. ఉపేందర్ కుమారుడు, కుమార్తె విద్యాభ్యాసానికి కూడా సాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆ గ్రామ మాజీ సర్పంచ్ కుశల్‌రెడ్డి, సాధిక్‌అలీ తెలిపారు.

కట్టంగూరు: మండలంలోని పందనపల్లి గ్రామానికి చెందిన ఆవుల కిరణ్ బయోటెక్నాలజీలోని వైరాలజీ విభాగంలో డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ఒడిశాలోని బయోటెక్నాలజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ భువనేశ్వర్‌లో జీవసాంకేతిక విజ్ఞాన విభాగంలో డాక్టర్ సయ్యద్ గులాం హుస్సేన్ పర్యవేక్షణలో (హైపటైటీస్ సీ - వైరస్ రూపాంతరం) అంశంపై పరిశోధన పూర్తి చేసి సమర్పించిన గ్రంథానికి డాక్టరేట్ దక్కింది. డాక్టరేట్ పట్టా అందుకున్న కిరణ్‌తో పాటు తల్లిదండ్రులు ఆవుల నర్సింహ, లక్ష్మిలను మల్లికార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

తిప్పర్తి: ధరణి వెబ్‌సైట్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను స్పెషల్ డ్రైవ్‌లో వేగవంతం చేస్తున్నామని తహసీల్దార్ డి.స్వప్న అన్నారు. ధరణి వెబ్‌సైట్‌లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ 9 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సం బంధిత లబ్ధిదారులకు సమాచారం అందించి వాటి దస్తావేజులను కార్యాలయంలో ఇవ్వాలని కోరినట్లు ఆమె తెలిపారు.

గట్టుప్పల్: కాళేశ్వరంపైన సిట్టింగ్ జడ్జీతో ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్ డిమాండ్ చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టులో అవినీతి చేసి ఏమీ తెలియనట్లు మేడిగడ్డ పర్యటనకు వెళ్తున్నారని విమర్శించారు.

శాలిగౌరారం: మండలంలోని మాధవరం కలాన్ గ్రామ ప్రైమరీ, హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు తీగల వెంకన్న, రవీందర్, గోవర్ధన్ పరీక్ష ప్యాడ్లను, పండ్లను పంపిణీ చేశారు.

నాగార్జునసాగర్: ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఈ నెల 3వ తేదీ ఆదివారం తప్పకుండా పోలియో చుక్కలు వేయించుకోవాలని అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నగేష్ తెలిపారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు, ఆయాలకు శిక్షణ ఇచ్చారు. సాగర్‌లో 1387 మంది పిల్లలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ హిల్ కాలనీ బీసీ గురుకుల పాఠశాల క్రీడామైదానంలో నేటి నుంచి రెండు రోజుల పాటు కుందూరు జానారెడ్డి చాలెంజ్ ట్రోఫీ 70వ తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలోకరావు, కర్తయ్య తెలిపారు. ఈ పోటీలు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో ఉదయం సాయంత్రం సమయంలో మ్యాట్‌లపై నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

మునుగోడు రూరల్: మండలంలోని ఇప్పర్తి గ్రామంలో సయ్యద్ హజరత్ ఊరసు షరీఫ్ గంధం ఉత్సవాల్లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దేవరకొండ: విద్యార్థులు మనోధైర్యం కోల్పోకుండా ధైర్యంగా ముందుకు సాగి అనుకున్నది సాధించుకోవాలని నెహ్రూ యువకేంద్ర అధికారి ప్రవీణ్‌సింగ్, సైకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు.